చిట్టికథ

-కాశీభట్ల బుచ్చానందం



మా స్నేహితుడు ఒకడున్నాడు. వాణ్ని ఇంట్లోనూ, బయటా అంతా 'చిట్టీ' అని పిలిచే వాళ్లం. వాడికి బాలసారెనాడు పెట్టిన పేరు చాలా పెద్దది. వీడి బాలసారెకు వచ్చి అక్షింతలు వేసిన వాళ్లంతా అయినవాళ్లూ, పొరుగువాళ్లూ కూడా వీడి పేరుకి తలో ముక్కా అతికిస్తో పోయేటప్పటికి అది పెద్దాపురం చేంతాడంత అయింది.

ఆఖరికి వాళ్ల ఎదురింటి మామ్మగారు కూడా వచ్చి, వాడు వాళ్ల అమ్మకడుపులో పడినప్పటి నుండీ, తన పేరు కూడా వీడికి పెట్టించమని ఏనాడో స్వర్గానికి పోయిన వాళ్లాయన కలలో కనపడి రోజూ వేధిస్తున్నాడని చెప్పి ఆయన పేరూ తగిలించి మరీ వెళ్లింది. ఆవిడ వచ్చి కన్నీళ్లు తుడుచుకుంటూ, ముక్కు చీదేస్తో చెప్పేటప్పటికి కాదనటం ఎలాగో తెలియని మా వాడి తండ్రి ఆ ముసలాయన ఆత్మశాంతికి ఆయన పేరు, పక్కింటావిడకి ఆవిడ ఇలవేలుపు కలలో కనపడి 'మీ పక్క ఇంట్లో పుట్టిన పిల్లాడికి నా పేరు పెట్టిస్తావా, లేకపోతే ఈ బెత్తంతో బాదనా' అని కన్ను మూసేసరికి కనపడి బెదిరిస్తూ ఉంటే పాపం ఆవిడని దెబ్బలనుంచి రక్షించటానికి ఆవిడ ఇలవేలుపు పేరూ ... అలా పెట్టుకుంటూ పోయేసరికి అది తడిసి మోపెడయింది.

చిట్టి వాళ్ల నాన్న పరమ మొహమాటస్తుడు, నెమ్మదస్తుడూను. ఏ పేరుతో పిలవకపోతే ఎవరికి కోపం వస్తుందో అని భయంతో మొత్తం పేరు అంతా పిలుద్దామని వాడు పెరట్లో ఉన్నప్పుడు పిలవటం మొదలుపెడితే, పేరు చివరికి వచ్చేటప్పటికి వాడు వీధి దాటేసేవాడు. అందుకని ముద్దు ముద్దుగా, పొట్టిగా పిలవడానికీ వీలుగా ఉంటుందన్న ఉద్దేశంతో చిట్టీ అని పిలవటం మొదలుపెట్టారు. అదే అందరికీ అలవాటయిపోయింది.

వీడు కొత్తగా మా బడిలో చేరినప్పుడు మొట్టమొదటి రోజున మేష్టారు అటెండెన్స్ వేస్తూ, వీడి పేరు పిలవడం మొదలుపెట్టి,

పూర్తయ్యేసరికి పీరియడ్ అయిపోతుందని భయపడి, "ఒరేయ్ గుండూ! నీకు చిన్న పేరు కానీ, ముద్దుపేరు కానీ ఏదీ లేదురా, గాడిద !" అని చాలా ముద్దుగా అడిగేరు.

మా క్లాసు పిల్లలలోనే పరోపకారి పాపన్న ఒకడు ఉన్నాడు. వాడు ఠకీమని లేచి నుంచుని, అప్పట్లో మా ఆనవాయితీ ప్రకారం చేతులు కట్టుకుని, "లేకేమండీ, మేష్టారూ! ఇంటి దగ్గర అంతా వాణ్ని 'చిట్టీ' అని పిలుస్తారండీ!" అని ఒక్క అరుపు అరిచి కూర్చున్నాడు.

దానితో మావాడి పేరు లోకానికంతా వెల్లడయి, మా స్కూళ్లో మంచినీళ్లిచ్చే గంగమ్మ మొదలు, హెడ్‌మాస్టారి దాకా వాడు 'చిట్టి' అయిపోయేడు.

నెమ్మదిగా టెంత్‌లోకొచ్చేకా, రిజిస్టర్‌లో పేరెక్కించుకొనేటప్పుడు మాత్రం హిప్పీ జుట్టు వాడో, జులపాలవాడో సెలూన్‌కి వెళ్లి సమ్మర్ క్రాప్ చేయించుకున్నట్టు, తన పేరులో అక్కర లేని సరంజామా అంతా తీసేసి అటు ఆస్తులు పోకుండాను, అభిమానాలు చావకుండానూ కావ లసినంతమటుకు, 'వీర వెంకట సూర్య సత్య సుందరరావు' అని మామ్మలూ, అమ్మమ్మలూ, తాతలూ, తల్లిదండ్రులకు ముఖ్యంగా కావలసినవి మాత్రం అట్టేపెట్టుకొని మిగతాదంతా తీసిపారేశాడు.

అయినా వాడు మాత్రం అందరికీ చిట్టిగానే మిగిలిపోయేడు. అదే వాడికి పట్టుకున్న బాధ. నిరంతరం దాని గురించే ఆలోచిస్తూ బాధపడుతూ, బాధపడుతూ ఆలోచిస్తూ చిక్కి సగమయిపోయేడు.

చాలాకాలమయింది మా చిట్టిని కలిసి. ఒకసారి చూద్దామని వాళ్ల ఇంటికి వెళ్లేను. హాల్లో వాళ్ల అమ్మగారు దిగాలుగా కూర్చుని కనిపించేరు. ఎప్పుడూ హుషారుగా తను నవ్వుతూ, అందర్నీ నవ్విస్తూ, మధ్యలో వాళ్ల ఆయన్ని తిడుతూ, మా చిట్టిని గారం చేస్తూ, గజలక్ష్మిలాగా ఇల్లంతా అలంగం తిరిగే ఆవిడ ఇలా డీలా పడిపోయేరేమిటా అని ఆలోచిస్తూ నెమ్మదిగా వెళ్లి ఎదురుగా నిలుచున్నా "చిట్టి ఇంట్లో లేడా అండీ!" అంటూ.

ఆవిడా నన్ను చూడగానే దిగాలున ఉయ్యాలబల్ల మీద నుంచి లేచి, దుఃఖం ఆపుకుంటున్నట్టు, పమిటకొంగు నోట్లో కుక్కుకుని, నన్ను తన వెనకాలే రమ్మన్నట్టు సౌంజ్ఞ చేస్తూ పెరటివైపు వెళ్లేరు, ఇదేమిటిరా బాబూ! నేరకపోయి అనవసరంగా వచ్చి చిక్కుకుపోయేను, ఏం గొడవో ఏమిటో! అనుకుంటూ ఆవిడ వెనకే పెరట్లోకి వెళ్లేను.

ఆవిడ మహా దొడ్డ ఇల్లాలు. అంత బాధలోనూ పెరట్లో అరుగుమీద నన్ను కూర్చోమని, గుడ్ల నీళ్ళు కుక్కుకుంటూ, దుఃఖం దిగమింగుకుంటూ మెట్టుమీద చతికిలపడి, "నాయనా! నువ్వూ, మా చిట్టీ మాకు వేరు కాదు (మళ్లీ ఆస్తిలో వాటాకి వస్తానని భయం వేసినట్లుంది). మేం ఒకేలా అనుకుంటున్నాం.' బాబూ! వాడికి పెళ్లి సంబంధాలు కూడా వస్తున్నాయి. మా అత్తగారూ, మామగారూ బాగా పెద్దవాళ్లయిపోయి నేడో, రేపో అనేటట్టున్నారు. మా అమ్మా, నాన్న సరేసరి. వీడికి పెళ్లయి మనవడో, మనవరాలో పుడితే చూసి కానీ పోమంటున్నారు."

వీడికి పెళ్లయి పిల్లలు పుట్టేదాకా వాళ్లు పోరనే గారంటీ ఉంటే, వీడి పెళ్లి చెయ్యకపోతే సరి, వాళ్లు చచ్చినా చావరు కదా! ఈ విషయం ఈవిడతో ఈ టైములో చెప్తే బాగుంటుందా బాగుండదా అని ఆలోచిస్తున్నాను.

చిట్టీ వాళ్ల అమ్మగారు ఆవిడ దోవని ఆవిడ చెప్పుకుపోతూనే ఉంది. "ఇది నాయనా, అసలు సంగతి! వాడి పెళ్లిచేసేద్దామని ఘాట్టిగా అనుకుంటున్నాం. వీడు ఇలా తయార య్యేడు. ఎప్పుడూ తలమీద చేతులు పెట్టుకొని అలా దేనికేసో దిగాలుపడి చూస్తో ఉంటాడు. ఎంతమంది పిలిచినా ఉలకడు, పలకడు. ఏవేవో పూజలూ, మొక్కుబడులూ కానిస్తోనే ఉన్నాం. అప్పటికే తాయెత్తు కూడా కట్టించేము. నీకూ తెలుసుగా ఇంతకుముందు బాగానే ఉండేవాడు. ఎంత చలాకీగా ఉండేవాడని వెర్రినాగన్న! ఇదిగో మొన్న ఆ ముదనష్టపు సంబంధం చూడటానికి వెళ్లేం. అప్పటినుంచీ ఇలా అయిపోయేడు. వాళ్ల కాస్త బాగా ఉన్న వాళ్లేను. పెట్టుపోతలు, కట్నకానుకలు అన్నీ బాగానే అఘోరిస్తారు అంటే కాబోసు, చూద్దామని వెళ్లేం. ఇంత కొంపముంచుతారనుకోలేదు. ఆ పిల్ల ఒక్కర్తే పిల్ల అని ఆశ పడ్డాం కానీ, ఆ పిల్లని చూసి వీడు ఇంత ఇలా ఝడుసుకుంటాడనుకోలేదు. పిల్లచూడటానికి బాగానే ఉంది బుట్ట బొమ్మలాగా. ఆ కాలపుపిల్ల కాదు ఈ కాలపుపిల్లే. అయినా మాయాబజారులో లక్ష్మణ కుమారుడిని మాయాశశిరేఖ భయపెట్టినట్లు, ఏం మాయచేసిందో ఏమో ఇలా అయిపోయేడు'' అంటూ తెగ ఇదయిపోయింది ఆవిడ.

"పోనీ! ఆ అమ్మాయిని చూసీ చూడగానే ప్రేమించేసి, ఆ అమ్మాయిని తప్ప ఇంకెవర్నీ చేసుకోనని శపథం పట్టి అలా అయిపోయేడేమో కాస్త కనుక్కోలేకపోయేరా!' 'అన్నా సమస్యని అన్నిపక్కలనుంచీ నరుక్కు వద్దామని.

"ఆ! అదీ అయింది. ఛస్తే ఇంకా ఆ గడప తొక్కనన్నాడు. అమ్మాయిమాట అలా ఉంచి, ఆ గడపేతొక్కనన్న వాడిని గురించి అలాంటి మాటలనకు నాయనా! వాడు ఈ కాలపు పిల్లవాడు కాదు. బాబూ! నేను నిన్ను ఇన్నిసార్లు అడుగుతున్నాననుకోకు. ఒక్కసారి నువ్వు వాడితో మాట్లాడి ఏమిటో కథాకమామిషూ కనుక్కో. ఏ విషయం తెలియక ఒహటే నానా అతలాకుతలం అయిపోతున్నాం బాబూ! నువ్వే ఆరా తియ్యాలి!'' అంటూ ఆవిడ ఒహటే ఇదయిపోతూ బతిమాలేటప్పటికి ఇక తప్పింది కాదు.

'సరే'నంటూ వాడు ఉన్న గదిలోకి వెళ్లేను.

వాడి గదిలోకి వెళ్లగానే విచిత్రమైన వాసన సాంబ్రాణి వగైరాలు ధూపం వేసినట్టు రావటం మొదలుపెట్టింది. పాపం వాడి వాలకం చూస్తోంటే జాలేసింది. వాడు టేబుల్‌ముందు కుర్చీలో కూర్చుని టేబుల్‌మీద కాళ్లు రెండూ బారజాపేడు. మెడ వెనక్కు వేళ్లాడేసి రెండుచేతులూ నెత్తి మీద పెట్టుకొని అలా సీలింగ్‌కేసి చూస్తున్నాడు. గడ్డం పెరిగిపోయింది. రెండు దండలకీ ఏవేవో తాయెత్తులు, మెడలోతాళ్లూ వేలాడుతున్నాయి. తల రేగిపోయి, మన లోకంలో ఉన్నట్లు లేడు. అప్పటికీ చెయ్యి



అర్ధరాత్రి

అర్ధరాత్రి డాక్టర్ సురేష్‌కి ఫోన్ వచ్చింది వంశీకి ఒంట్లో బాగోలేదని. అతని ఇంటికి రమ్మని. సురేష్ మంచం దిగి డ్రెస్ వేసుకుని కుంభవృష్టిగా కురిసే వర్షంలో ఆ పేషెంట్ ఇంటికి వెళ్లి పేషెంట్‌ని పరీక్షించాక ఓ ఇంజక్షన్ ఇచ్చి చెప్పాడు. "వెంటనే ఆయన దగ్గర బంధువులని పిలిపించండి" అని.

" ఆయన పరిస్థితి అంత ప్రమాదకరంగా ఉందా? "అడిగారు అంతా వచ్చాక కంగారుగా.

"ఊహుఁ. ఆరోగ్యంగానే ఉన్నాడు. అర్ధరాత్రి అనవసరంగా నిద్ర నుంచి లేచి వచ్చిన సన్నాసిని నేనొక్కడినే కాకూడదని" చెప్పాడు సురేష్ వాళ్లతో కోపంగా.

పి.వి. మురళీకృష్ణ

ఊపేను కళ్లముందు పైకీ, కిందకీను.

"ఊహుఁ." ఉలుకూ పలుకూ లేదు. వీడు వేషాలు కాదు. నిజంగానే నిరాశా నిస్పృహలలో కొట్టుకుంటున్నట్లు ఉన్నాడు. వీడ్ని ఇలా వదిలేస్తే లాభం లేదు. కొంతకాలానికి పిచ్చి పట్టటం ఖాయం అని, లాగి ఒక్కటేసేను వీపుమీద. దెబ్బకి దయ్యం వదిలినట్లు ఒక్కసారి తల విదిలించి మన స్పృహలోకి వచ్చేడు. నాకేసి చూసి, "నువ్వా, సుబ్బారావు! ఎప్పుడు వచ్చేవు?" అన్నాడు.

"అబ్బో! అదంతా చెప్పాలంటే ఒహ పెద్ద కథ అవుతుంది. చెప్పటానికి నాకూ, వినటానికి నీకూ ఓపిక ఉండదు కానీ, ఏమిటీ ఈ వాలకం? సడెన్‌గా ఇలా అయిపోయేవు! నీట్‌నెస్ అయినా ఇవ్వకుండా?" అన్నాను.

"ఏం చెప్పను సుబ్బారావు! అదంతా ఒక వ్యథ. ఇలా కూర్చో!" అని కుర్చీ చూపించి, "అమ్మా! కాస్త కాఫీ పట్టుకురా! సుబ్బారావు వచ్చేడు!" అన్నాడు.

ఆ వెర్రి తల్లి ఆ వక్కనే తచ్చాడుతున్నట్లుంది - వీడి విషయం నేనెలా పరిష్కరిస్తున్నానో తెలుసుకోవటానికి. ఒక్క గెంతులో గుమ్మంలోకి వచ్చి, "సుబ్బారావు వచ్చేడా! అలాగే, నాయనా! కాఫీ తెస్తాను!" అంటూ - ఇప్పటిదాకా బాగానే లాక్కొచ్చేవు. కానీయ్! 'బ్రేవో మై బాయ్!' అన్నట్టు చిరునవ్వుతో అర్థింపుగా నావైపు ఒక్క చూపు చూసి లోపలికి వెళ్లిపోయేరు.

"ఊ, ఏమిటోయ్ చిట్టీ! ఏమిటీ..." నేనింకా నా మాట పూర్తిచెయ్యనేలేదు. వాడు నిలువెల్లా వణికిపోతూ, "ఒరేయ్ సుబ్బారావు! ఆ మాటనకు! ఆ మాటనకు! నాకు ఒంటిమీద తేళ్లూ, జెర్రులూ పాకుతున్నట్లుంటుంది!" అంటూ ఘాట్టిగా ఒక్క కేక వెయ్యటం, నేను నోరు మూసి ఆలోచించటం మొదలు పెట్టాను.

కాస్త వాడు సర్దుమణిగేక, "అది కాదురా బాబూ! చి ... "

నా నాట్లో మాట నోట్లో ఉండగానే ఒక్క తోపు తోసేడు - "నోరు మూస్తావా, లేదా?" అంటూ.

అప్పుడు ఏదో లీలగా అనిపించటం మొదలుపెట్టింది., వీడి పేరుకీ, ఈ వైరాగ్యానికీ ఏమైనా సంబంధం ఉందా? అని. అయినాకానీ వాడినే కనుక్కుని కన్‌ఫర్మ్ చేసుకుంటే బాగుంటుందన్న దృష్టితో 'ఒరేయ్!" అన్నా.

అప్పటికే వాడి కళ్లు దయ్యం పట్టినవాడికిలాగా గిరగిరా తిరగటం మొదలుపెట్టేయి. నాకు భయంవేసింది. 'ఈ విషయాన్ని అటునుంచి నరుక్కువద్దాము అసలు సంగతి తెలుసుకోవటానికి' అని, వాడి పేరు ఊసు లేకుండా, "అసలు ఏం జరిగిందిరా! ఈ మధ్య ఏదో పెళ్లిచూపులకి వెళ్లేవుట? ఏమిటి సంగతి? ఎలా ఉంది అమ్మాయి? నీకు నచ్చిందా? లేకపోతే ఏం పరవాలేదులే! ఇంకో పిల్లని చూడొచ్చు!" అని వాడికి హాశ్చర్యపోవటానికి, అల్లరి చేయటానికీ సావకాశం లేనంత స్పీడ్‌గా మాట్లాడేశాను - దాంతో నాకు కాస్త ఆయాసం వచ్చినా.

వాడు కాస్త స్తిమితపడి, "అదే నా కొంప ముంచిది!" అన్నాడు.

అమ్మయ్య ఇప్పటికి వీడు దారిలోకొచ్చేడు కాబట్టి, విషయసేకరణ మొదలుపెట్టవచ్చు ననుకుంటూ ఉంటే, చిట్టీ వాళ్ల అమ్మగారు కాఫీ తెచ్చేరు.

కాఫీ తాగుతూనే వాడ్ని అడిగేను, "ఆ అమ్మాయి బాగుండలేదా?" అని.

వాడన్నాడు - "అమ్మాయి బాగుండకేం? చాలా బాగుంది. నిక్షేపంలా ఉంది! నా జాతకమే బాగుండలేదు!"

"సరే, ఇంక ఇక్కడదాకా వచ్చేక ముసుగులో గుద్దులాట ఎందుకు? వరుసగా జరిగింది చెప్పు!" అన్నాను.

"చెప్పడానికి ఏం ఉంది? సంబంధం మంచిదే. ఆ పిల్ల ... సారీ, ఆ అమ్మాయి డిగ్రీ ఫైనల్‌లో ఉంది. బాగా ఉన్నవాళ్లు, మంచివాళ్లు కూడానట. మా పెద్దలు అందరూ కలిసి పోరితే, సరేనని బయలుదేరాను. వాళ్లే కార్లు పంపేరు. అక్కడిదాకా అన్నీ బాగానే ఉన్నాయి. వాళ్ల హాల్లో పెళ్లిచూపులు ఏర్పాటు చేసేరు. అదీ బాగానే ఉంది. మాకంతా బాగా మర్యాదలు చేసేరు. ఇక్కడిదాకా అంతా మంచిగానే, బాగానే జరిగింది."

"ఇక్కడిదాకా బాగానే ఉంది, బాగానే ఉంది అని కథ సాగదీస్తున్నావు! అసలు బాగులేనిది ఎక్కడ? ఆ విషయం చెప్పేడు!' ' అన్నా విసుగొచ్చి.

"అదే, ఆ అసలు విషయమే చెప్పటానికి చూస్తున్నా. ఆ అమ్మాయి డిగ్రీ ఫైనల్ ఇయర్ అని చెప్పేను కదా! ఆ రోజు ఆదివారమేమో ఆ అమ్మాయి క్లాసుమేట్సు చాలామందే వచ్చేరు. ముందు హాల్లోకి వచ్చేటప్పుడే నాకు అనుమానం వచ్చింది. పొరబాటున లేడీస్‌వెయిటింగ్ రూమ్‌లోకి వచ్చేమేమోనని. అంతమంది ఉన్నారు. మర్యాదలు అన్నీ బాగానే చేసేరు. తరువాత టిఫిన్, కాఫీల కార్యక్రమం కూడా పూర్తయింది. ఇంక పెళ్లికూతుర్ని తీసుకు రమ్మన్నారు. పాలోమని ఈ ఆడపిల్లలంతా, సముద్రంలో కెరటాలు చూడు - హోరుమంటూ పెద్దచప్పుడు చేస్తూ ముందుకి వచ్చి, మళ్లీ అంత చప్పుడూ చేసుకుంటూ వెనక్కి పోతాయి. అలాగా, అంతా లోపలికి వెళ్లి, మళ్లీ పాలోమంటూ అంత హడావుడిగానూ హాల్లోకి వచ్చేరు. ఆ పిల్లలందరి మధ్య ఇరుక్కున్న ఆ అమ్మాయిని ... అదే పెళ్లికూతుర్ని కనుక్కోవటం కాస్త కష్టమయిందనుకో! మొత్తంమీద ఆ అమ్మాయిని కనిపెట్టి చూస్తున్నాను. పిల్ల పరవాలేదు, బాగానే ఉంది. అంతా బాగానే ఉంది కానీ, నా జాతకంలో దుష్టగ్రహాలన్నీ కలిసి నా నెత్తిన తన్నిన వేళ అదే!" అంటూ మళ్లీ వాలిపోయేడు.

"మళ్లీ మళ్లీ అలా పడిపోకురా, నాయనా! ఏక్షన్ వద్దు! అంతా నెరేషనే! ఆ దుష్టగ్రహాలన్నీ తన్నిన వేళ, అప్పుడు ఏం జరిగింది చెప్పు!" అని ఆత్రుతగా అడిగాను.

ఖాళీ కాఫీ కప్పు ఒకసారి నోటిదగ్గర పెట్టుకుని, తల విదిలించి "ఏం చెప్పను? ఆ అమ్మాయి నాన్నగారు 'బాబూ! పెళ్లికూతుర్ని సరిగ్గా చూడు! ఏమైనా ప్రశ్నలు వేస్తే వెయ్యి! మొహమాట పడకు!' అన్నారు.

"నేనూ ఆలోచిస్తున్నాను. ఆ అమ్మాయికేసి చూస్తో ఏం అడగాలా అని. అదే టైము టప్‌న నా జాతకం తిరగబడి ఆ దుష్టగ్రహాలన్నీ మా తాతని ఆవేశించినట్టున్నాయి. ఆయన ఒక్క సారి గుటుక్కున మంచిఉత్సాహంగా 'అడగరా, చిట్టీ! అడుగు! ఆ అమ్మాయిని ఏం అడుగుతావో అడుగు!' అని ఒక్క కేక పెట్టేడు. అంతే! ఒక్కసారి 200 కిలోమీటర్ల వేగంతో తుఫాన్ గాలులు వీస్తున్నప్పుడు సముద్రపు ఘోష ఎలా ఉంటుంది? ఆ హాలంతా అంత శబ్దమైంది. ఆ అమ్మాయి ఫ్రెండ్సంతా ఫెళఫెళార్భాటాలతో ఒహటే నవ్వులు, కేరింతలు! ఒహటే గొడవ! వాళ్ల పెద్దవాళ్లంతా బాగుండదనుకున్నారో, ఏమో చేతులు నోటికి

అడ్డుపెట్టుకునీ, మొహాలు పక్కకి తిప్పుకునీ నవ్వుకున్నారు. ఈ ఆడపిల్లలంతా మాత్రం ఏ మైఖేల్‌జాక్సన్ షో చూస్తున్నట్టు, వాళ్లని వాళ్లు మర్చిపోయి అల్లరి చేసేరు. ఇంతలో ఒక అమ్మాయి అడిగింది పెళ్లి కూతుర్ని. కాస్త హాలు సర్దుమణిగాక - ఏమే! తలుపుల దగ్గర పేర్లు చెప్పిస్తారు చూడూ! అప్పుడేమని చెప్తావే? సరదాగా ఒకసారి రిహార్సల్ వేద్దాం, చెప్పు!' అంది.

'నీ మొహం అదేం చెప్తుందే? నేను చెప్తా చూడు! 'మా చిట్టి బావగారూ, నేనూ వచ్చేం తలుపు తీయండి!' అంటుంది' అంటో ఒక అమ్మాయి పెద్ద ఆరిందాలా హావభావాలు మార్చి అంది. మళ్లీ హాలంతా ఒక ఉత్తుంగ తరంగం ఎగసిపడినట్లు, స్టంటు సినీమాలో గోడౌన్లో హీరో దొంగతో యుద్ధం చేస్తున్నప్పుడు హడావుడికి ఏర్పాట్లు చేస్తారు చూడు, ఆ డ్రమ్ములన్నీ ఒక్కసారి దొర్లిపోయినట్టు... ఫెళఫెళార్భాటాలతో చప్పుడు గూబలు గుయ్యిమనేలాగా హోరు. నా తల పైకెత్తలేకపోయేననుకో! ఆ అవమానంతో వంచిన తల ఎత్తలేక మొత్తంమీద అక్కడనుండి ఎలాగో అలాగ బయటపడ్డాను.''

''ఆ వ్యవహారం అంతటితో అయిపోయిందిగా! ఆ సంబంధం ఏమైంది?' ' అని అడిగాను.

"నా తలకాయ! ఇంకేం అవుతుంది. తరువాత మా అబ్బాయిని కనుక్కుని చెప్తామని నా వెనుకే మా వాళ్లంతా బయటికి వచ్చేసేరు'' అన్నాడు.

"ఇంతకీ అసలు వ్యవహారం ఏమిటి? ఆ అమ్మాయినే పెళ్లి చేసుకోవాలని నువ్వేమయినా కలలుకంటూ ఇలాగయిపోయేవా ఏమిటి చెప్పు!'' అని అడిగేను.

"ఆ అమ్మాయినా! పెళ్లి చేసుకోవటమా? ఛస్తే ... ఇంక జన్మ అంతా 'చిట్టీ! చిట్టీ!' అంటూ ఏడ్పించి పోగులు చేస్తుంది!'' అన్నాడు.

"అయితే ఇప్పుడు నీ బాధ ఏమిటో చెప్పరా నాయనా! ఏం చెయ్యాలో ఆలోచిద్దాం!' ' అన్నాను.

"ఏం లేదురా, ఈ 'చిట్టీ' అన్న పేరు చెరిపెయ్యాలిరా! ఇంక జన్మలో ఎవరూ నన్ను చిట్టీ అని పిలవకూడదు. దానికి ఏం చెయ్యాలో చెప్పు, నన్ను రక్షించినవాడివవుతావు!'' అన్నాడు ఏడ్పు మొహం పెట్టి.

"అయితే ఏ పేరు నీకిష్టమో చెప్పు, అదే వ్యవహారంలో పెడదాం!'' అన్నాను అంతా నా చేతుల్లో ఉన్నట్టు.

''నా పేరు వీర వెంకట సూర్య సుందరరావు కదా! అందులో 'సుందర్' అని పిలిపించుకుందామని ఉందిరా! నవ్వకు! చిన్నప్పటినుంచీ ఆ పేరే నాకిష్టం!'' అన్నాడు మురిసిపోతూ.

"మరి అయితే టెన్త్‌లో పేరు ట్రిమ్ చేసుకునేటప్పుడు, అలాగే రాసుకోలేకపోయేవా?'' అన్నాను.

"అమ్మో! అలా అని మావాళ్లకి తెలిస్తే నా మక్కెలు విరగదన్నరూ! అందరికీ నా మీద కోపం వచ్చేసును. ఆ గొడవంతా ఇప్పుడెందుకు కానీ, నన్ను అంతా 'సుందర్' అని పిలిచేటట్టు చెయ్యి. నీకు జీవితకాలం ఋణపడి ఉంటాను. భయపడకు! మా అబ్బాయి పేరులో నీ పేరూ కలిపి పెట్టుకుంటానులే!'' అన్నాడు - నేను అక్కడికి నా పేరు ఎవరికి పెట్టించాలా అని ఎదురు చూస్తున్నట్టు.

ఇలాంటి వ్యవహారం నాకూ కొత్తే. అలాగే కూర్చుని ఆలోచించగా ఆలోచించగా నాదీ చాలా తెలివైన బుర్ర కాబట్టి ఒక ఉపాయం తట్టింది. సరే, ఇంక వీడి దుష్టగ్రహాలు అన్నీ కట్టకట్టుకుని పారిపోయే సమయం వచ్చింది కనుకే నాకు ఇంత మంచి ఆలోచన తట్టిందని అనుకుంటూ, "ఒరేయ్ చిట్టీ!'' అనబోయి నాలుకకొరుక్కున్నా. ఆ కాస్తదానికే వాడు మిర్రి మిర్రి చూడటం మొదలుపెట్టాడు.

"సారీరా! అలవాటులో పొరపాటుగా వచ్చేసింది. ఏమీ అనుకోకు. నీ పరిస్థితి నుంచి బయటపడటానికి ఇప్పుడు మనముందున్నది ఒకటే ఉపాయం. నీకు తెలిసినవాళ్లందరి తోటీ ఖచ్చితంగా చెప్పెయి - ఇకముందునుంచీ చిట్టీ అని పిలిస్తే ఏ పరిస్థితిలోనూ పలకననీ, 'సుందర్' అని పిలిస్తేనే పలుకుతాననీ. అలా ఊరికే చెప్పటమే కాదు, అమలు చెయ్యి. చిట్టీ అని ఎవరు ఎప్పుడు పిలచినా పలకకు. అలా శపథం చెయ్యి! చిట్టీ అని పిలిస్తే పలకలేదనుకో, నిన్ను కాదన్నట్టు ఊరుకున్నావనుకో, అప్పుడు అందరూ చచ్చినట్టు నిన్ను 'సుందర్' అనే పిలుస్తారు. కానీ ఒక వరుస ముందు అందరికీ నువ్వు ఈ విషయం చెప్పుకోవాలి. అంతా నీలోనే ఉంది!'' అని హితోపదేశం చేసేను.

దీంతో వాడి మొహం దీపావళినాడు ఏరికోరి పాళ్లేసి స్వంతంగా కట్టి వెలిగించిన మతాబాలా వెలిగింది.

"చాలా థాంక్స్‌రా, సుబ్బారావు! నీ మేలు ఈ జన్మలో మరిచిపోను. నీకు జన్మజన్మలకీ ఋణపడి ఉంటాను. ఈ నిమిషం నుంచీ మా వాళ్లందరికీ ఈ విషయం చెప్పేస్తాను!'' అన్నాడు.

"వస్తానురా సుందర్!'' అని నేనూ బయలుదేరాను.

రెండు రోజులు పోయేక వాడి ప్రాక్టీసు ఎలా ఉందో చూద్దామని ఆఫీసుకి వెళ్లబోతూ, కాస్త దూరమైనా వాడింటికి వెళ్లేను. అప్పుడే వాడూ ఎక్కడికో బయలుదేరినట్టున్నాడు ఇంటి మెట్లు దిగి అటువేపు వెళ్లిపోతున్నాడు.

"ఒరేయ్ సుందర్!'' అని ఎంత అరిచినా పలకడే! ఆఖరికి విసుగొచ్చి ఇదీ ట్రై చేసి చూద్దామని "చిట్టీ!'' అని కేకేసేటప్పటికి వెనక్కి తిరిగి నన్ను చూసి నా దగ్గరకు వచ్చేడు.

"ఏరా? నీకంత చెప్పినా మళ్లీ ఇలా తయారయ్యావు! ఎన్నిసార్లు సుందర్ అని కేకేసినా పలకవు. చిట్టీ అనగానే చటుక్కున వెనక్కు తిరిగేవు!'' అన్నా.

"ఏదో ముందులో కాస్త బాధ అనిపించినా, అలవాటయిపోయిన పేరు కదా! ఇదిగో, ఇక్కడనుంచీ 'సుందర్' అని కేకేస్తే తప్ప చచ్చినా పలకను!'' అన్నాడు ఏదో నన్ను ఉద్ధరిస్తున్నట్టు.

వాడు అలా అంటూనే ఉన్నాడు. నాకు చెప్పి చెప్పి నోరు నొప్పి పుడుతూనే ఉంది. కానీ మా చిట్టి మాత్రం 'చిట్టీ!' అని కేకేస్తే తప్ప పలకడంలేదు.